సోమిరెడ్డికి ప్రజా సమస్యలు పట్టవు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కసుమూరు ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలను సోమిరెడ్డి ఎప్పుడూ పట్టించుకున్న దాఖలాల్లేవని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కసుమూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రజలు మేళతాళాలు, కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు. పలువురు వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరించి జగనన్న పాలనలో పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా వెలగబెట్టిన సోమిరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.కోట్లు దోచుకున్నాడే తప్ప, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆలోచన చేయలేదన్నారు. నీరు–చెట్టు, రైతు రథం పథకాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకున్నాడని విమర్శించారు. మిల్లర్ల వద్ద ముడుపులు తీసుకుని రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించకుండా చేశాడని చెప్పారు. కరోనా కష్టకాలంలో తాను నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తే, సోమిరెడ్డి మాత్రం హైదరాబాద్, బెంగళూరులో తలదాచుకోవడం వాస్తవం కాదానని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టని సోమిరెడ్డికి ఓటు అడిగే హక్కు ఎక్కడిదని మండిపడ్డారు. సర్వేపల్లి నియోజకవర్గ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని అభివృద్ధి పనులు తాను చేసి చూపించినట్లు వివరించారు. ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పిస్తూ, పట్టాలు పంపిణీ చేస్తే సోమిరెడ్డి తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే ఐదు దఫాలు ఓటమి పాలైన సోమిరెడ్డికి మరోసారి సర్వేపల్లి ప్రజల చేతుల్లో ఓటమి తప్పదని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి కవిత, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, శ్రీధర్‌నాయుడు, గుర్రం పుట్టయ్య, నాగేశ్వరరావు, చీకుర్తి నరసయ్య, మందా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి నాగలి అందజేసిన స్థానిక నాయకులు

వైఎస్సార్‌సీపీలోనే మైనార్టీలకు పెద్దపీట

- కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి


ప్రజలకు నమస్కారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ముస్లిం, మైనార్టీలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని పెద్దూరు నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు శుక్రవారం భారీ జన సందోహం మధ్య వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే టికెట్ మైనారిటీ వ్యక్తికి ఇస్తే సహించలేని వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని తెలిపారు. అలాంటి వ్యక్తి పేదలకు ఏం సేవ చేస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఐదేళ్లలో 2.75 లక్షల కోట్లతో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పరిధిలో డీబీటీ ద్వారా ఇప్పటివరకు రూ.162 కోట్లు అందించామన్నారు. నాన్ డీబీటీ ద్వారా రూ.72 కోట్లు అందించినట్లు వివరించారు. వీటితోపాటు పట్టణాభివృద్ధి విషయంలో ఏమాత్రం రాజీ పడలేదని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళేన్ని నగర పంచాయతీగా మార్చడం, ఎన్ఎస్సార్ తాగునీటి పథకం, బైపాస్‌రోడ్డు నిర్మాణం, పార్కు ఆధునీకీకరణ, రోడ్లు, డ్రైయిన్లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు తమ ప్రభుత్వ హయాంలో జరిగాయని వివరించారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని, ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని తెలిపారు. కరోనా సమయంలో కనిపించని తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు ఎన్నికల సమయంలో ప్రజల మధ్యకు వచ్చి నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పొరపాటు చేసి చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఐదేళ్ల పాటు రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. అమలు సాధ్యం కాని వాగ్దానాలతో మరోసారి చంద్రబాబు ఎన్నికల ముందుకు వస్తున్నారని, ఆయన మాటలు ఎవరూ నమ్మొద్దని తెలిపారు. ఈనెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో ప్రతి ఓటరుకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి కోవూరు ఎమ్మెల్యేగా తనను నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వాలు సంక్షేమం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు అని అన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, చైర్పర్సన్ మోర్ల సుప్రజ, నల్లపరెడ్డి గీతారెడ్డి, నల్లపరెడ్డి పూజారెడ్డి, నల్లపరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మల్లికార్జున్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారానికి హాజరైన ప్రజలు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరికలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విడవలూరు మండలం రామతీర్థం పంచాయతీ రామలింగాపురం గ్రామానికి చెందిన 50 ముస్లిం కుటుంబాలు బాషా ఆధ్వర్యంలో శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బుచ్చి పట్టణంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా వారికి ఎమ్మెల్యే ప్రసన్న పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఆహార పొట్లాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని పడారుపల్లి ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో కావలిరెడ్డి మల్లికార్జునరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని భార్య మాలతి సౌజన్యంతో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, పేదలకు శుక్రవారం ఆహార పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపీనాథ్‌రెడ్డి, శారద, రాజ్యలక్ష్మి, గుమ్మడి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించి ప్రచారాలు చేస్తే చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్

- గడువు అనంతరం ప్రచారాలపై నిఘా ఉంచండి
- పోలీస్ అధికారులకు సూచించిన ఆర్ఓ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించి ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో శుక్రవారం పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌మర్మత్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారాలకు అనుమతి ఉందన్నారు. గడువు ముగిసిన తరువాత నుంచి నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా ప్రచారాలు జరుగుతున్నాయేమోనని ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా ఉంచాలని తెలిపారు. 12వ తేదీన చేసే ప్రచారం ఏమాత్రం ఆర్భాటం లేకుండా కేవలం అభ్యర్థి తనతోపాటు మరో ముగ్గురితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరుకు నమస్కారం చేసుకుంటూ వెళ్లాలన్నారు. అలాకాకుండా అధిక మందితో కలిసి ప్రచారం చేయడం, సభలు నిర్వహించడం, మైకుల ద్వారా ప్రచారం చేయడంపై దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు సూచించారు. అలా ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే వాటిని అడ్డుకుని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పొరపాటున ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గొడవలు సృష్టించి తద్వారా ఎన్నికలకు ఆటంకం కలిగించే పరిస్థితి లేకుండా పటిష్టంగా నిఘా ఉంచాలన్నారు.

ట్రక్ ఆటో ఢీకొని యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారిపై లోటస్ గ్రాండ్ రెస్టారెంట్ సమీపంలో టీడీపీ కార్యాలయం వద్ద నిలబడి ఉన్న ఓ వ్యక్తిని ట్రక్ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పెద్దూరుకు చెందిన కొప్పోలు మహేష్(34) టీడీపీ కార్యాలయం వద్ద రోడ్డు మార్జిన్‌లో నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా వచ్చిన ట్రక్ ఆటో అతడిని ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన మహేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ

- పాల్గొననున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ఎన్నికల ప్రచారం చివరి రోజున శనివారం ఉదయం 10 గంటలకు పట్టణంలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ నిర్వహిస్తుందని పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ ర్యాలీలో సర్వేపల్లి అభ్యర్థి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. నెల్లూరు రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి రామనగర్‌గేటు సెంటర్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. మండలంలోని అన్నిగ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాల్సిందిగా పిలుపునిచ్చారు.

విరువూరులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

పొదలకూరు : మండలంలోని విరువూరు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరానికి నిపుణులైన వైద్యులు హాజరై రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. రక్త, బీపీ పరీక్షలు చేసి వృద్ధులకు తగిన సూచనలు చేశారు.

సర్వేపల్లి అభివృద్ధికి కాకాణిని గెలిపించండి


మనుబోలు : కాగితాలపూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


మనుబోలు : సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండలంలోని కాగితాలపూరు, ఎల్ఎస్‌పురం, కట్టువపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలో అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరించారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన వైనాన్ని గుర్తు చేశారు. కాకాణి మంత్రిలా కాకుండా ఇంటి బిడ్డలా సేవలందించారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు. గత ఐదేళ్లుగా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇంతలా గ్రామాల అభివృద్ధికి సహకరించిన కాకాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండాల ఆదినారాయణ, జానకిరామిరెడ్డి, అశోక్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటపాళెం గ్రామంలో..

ముత్తుకూరు : మండలంలోని పంటపాళెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఓట్లు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ రావి విజయకుమార్‌రెడ్డి, నంగా చెంగారెడ్డి పాల్గొన్నారు.


ముత్తుకూరు : పంటపాళెంలో..

వెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలార్చన


ప్రత్యేక అలంకరణలో శ్రీవారు, అమ్మవార్లు


లక్ష మల్లెలార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా శుక్రవారం వెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక లక్ష మల్లెలార్చన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముత్తైదువులకు పసుపు, గాజులు, సుమంగళి ద్రవ్యాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి చిమటా శేషగిరిరావు – హరిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీధి కుక్కల దాడిలో ఇరువురికి గాయాలు


వీధి కుక్కల దాడిలో మహిళ కాలికి తీవ్రగాయాలైన దృశ్యం

నెల్లూరు(బారకాసు): నగరంలోని బాలాజీనగర్ ప్రాంతం కొప్పర్తివారి వీధిలో వీధి కుక్కల దాడిలో ఇరువురు గాయాలపాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ రాత్రి గురువారం 7 గంటల సమయంలో వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. కుక్కలు ఆమెను కరవడంతోపాటు, గోళ్లతో గీకడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధిత మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే కొంత సమయం తరువాత మరో మహిళ అదే వీధిలో వెళ్తుండగా ఆమెపై కూడా కుక్కలు దాడి చేశాయి. ఆ మహిళకు స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయాన్ని నగరపాలక సంస్థకు చెందిన వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్‌కు తెలియజేయగా శనివారం ఆ వీధిలోని కుక్కలను పట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపటి నుంచి మూలస్థానేశ్వరునికి వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం సందర్భంగా ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు వసంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. అలాగే 12వ తేదీన జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు జరుగుతాయని తెలిపారు. వసంతోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ అలంకారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

పేదలందరికీ సంక్షేమం.. జగనన్నకే సాధ్యం


విడవలూరు : పార్లపల్లిలో ప్రచారం చేస్తున్న విజయసాయిరెడ్డి సతీమణి, కుమార్తె


కొడవలూరు: గుర్రాలదిన్నెలో ప్రచారం చేస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి, చలపతిరావు

విడవలూరు : రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి సతీమణి వేణుంబాక సునందారెడ్డి అన్నారు. మండలంలోని పార్లపల్లి గ్రామంలో తన కుమార్తె నేహారెడ్డితో కలిసి ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు తమకు ఘన స్వాగతం పలుకుతున్నట్లు వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ప్రతి పథకం గ్రామస్థాయిలో ప్రజలకు అందుతుండడంతో తమను ఇంతలా ఆదరిస్తూ అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డికి, కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తిక్కవరపు జనార్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ దాసరి శైలజా, పరిశగాని మాధవయ్య, నిమ్మల రామ్మోహన్, మడపర్తి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగుల కోసం శ్రమించే వ్యక్తి ప్రసన్న

విడవలూరు : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అని మాల మహానాడు జిల్లా యువత అధ్యక్షుడు బల్లి శరత్‌కుమార్ అన్నారు. మండలంలోని పార్లపల్లి, విడవలూరు హరిజనవాడ, జానపేట గ్రామాల్లో మాల మహానాడు యువత ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా శుక్రవారం ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీలో దళితులకు గౌరవం లేదని, వేమిరెడ్డి దంపతులకు దళితులంటే చిన్న చూపని, అందువల్లే దళితులంతా ఏకమై జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేదలు, బలహీన వర్గాలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలియజేశారు. దళితులంతా ఏకమై ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలిచర్ల సాయి, వినోద్, స్వర్ణ రాజేష్, వెంకటేశ్వర్లు, తులసి తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులకు జగనన్న శ్రీకారం

కొడవలూరు : రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగనన్న శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కమ్మపాళెం మజరా గుర్రాలదిన్నెలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలతో గ్రామ స్థాయి పాలన తీసుకొచ్చి గాంధీ కలలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదవారు ఉన్నతంగా చదవాలని సర్కారు పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గ్రామంలో పేదలంతా మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుంటామని సంతోషంగా చెప్పడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

టీడీపీలో ధనవంతులకే ప్రాధాన్యం

డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ టీడీపీలో ధనవంతులకే ప్రాధాన్యం కల్పిస్తారే తప్ప పేదల గురించి పట్టించుకోరని విమర్శించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని పక్కన పెట్టి ధనవంతురాలైన ప్రశాంతిరెడ్డికి టిక్కెట్ ఇవ్వడంతోనే టీడీపీ వైఖరి తేటతెల్లమైందన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బెల్లం వెంకయ్యనాయుడు సొంత నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గరిక మస్తానయ్య, కుందుర్తి దయాకర్, ఆరె షద్రక్, బెల్లం సందీప్‌నాయుడు, తలతోటి ప్రసన్న, అనమాల శ్రీనివాసులు, పోసిన రమేష్, కొమ్మి రమేష్‌నాయుడు, కె.చెంచురామయ్య, మందా జయంత్ పాల్గొన్నారు.

కాలనీల్లో..

కోవూరు : మండలంలోని మోడేగుంట ఎస్సీ కాలనీ, చెర్లోపాళెం ఎస్సీ కాలనీల్లో మాల మహానాడు జిల్లా యువత ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆయనకే దళితులందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బల్లి శరత్‌కుమార్, వెలిచర్ల సాయి, వెంకటేశ్వర్లు, గోపీ పాల్గొన్నారు.


విడవలూరు : ఎన్నికల ప్రచారంలో దళిత సంఘాల నాయకులు


కోవూరు : ప్రచారం చేస్తున్న మాల మహానాడు నేతలు